ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 21 జనవరి 2024 | 5



వెల్‌కమ్ సార్..





చంద్రబాబుకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న హరీష్‌మాధుర్, జ్యోతుల నవీన్



ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మీ కోసమే వచ్చా : మండపేటలో జరిగిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు. వేదికపై వేగుళ్ల జోగేశ్వరరావు, వేగుళ్ల లీలాకృష్ణ, యనమల, బాలకృష్ణ, చినరాజప్ప, దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి, బండారు, ఆనందరావు, ఆదిరెడ్డి, హరీష్‌మాధుర్, కొండబాబు తదితరులు

తెలుగుదేశం పిలిచిందని..

కదిలొచ్చిన జనం

జనచంద్రమైన మండపేట

- రా కదలిరా సభకు పోటెత్తిన జనం
- 50 నిమిషాలపాటు ప్రసంగించిన బాబు
- జగన్ వైఫల్యాలను ఎండగట్టిన మాజీ సీఎం
- దళితులు, బీసీ నాయకులకు అన్యాయం
- టీడీపీ, జనసేన నేతలు భారీగా హాజరు
- 30 మంది వైసీపీ నేతలు టీడీపీ తీర్థం



మీరే మా దేవుడయ్యా : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల



బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆర్ఎస్ దంపతులు, మాధుర్



బాబుకు స్వాగతం పలుకుతున్న నల్లమిల్లి, నిమ్మల, జీవీఆర్



అభిమానం : బాబుకు చిత్రపటాన్ని అందజేస్తున్న బాలుడు

అమలాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి)/ మండపేట: ఒక్క పిలుపుతో మండపేట జనచంద్రమైంది..జనమే జనం.. ఇసుకేస్తే రాలనంత జనం..జై బాబు జై జై బాబు.. సీఎం చంద్రబాబు నినాదాలతో హోరెత్తిపోయింది..ఎక్కడెక్కడి నుంచో నాయకులు.. జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు.. ఎటు చూసినా టీడీపీ జెండాలే.. ఎక్కడ చూసినా టీడీపీ జనమే.. మండపేట మొత్తం పసుపు దండుతో నిండిపోయింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటలో శనివారం రాత్రి జరిగిన రా కదలిరా 11వ బహిరంగ సభకు జనం పోటెత్తారు. బాబు ప్రసంగం సాగినంత సేపు కేకలు.. అరుపులతో హోరెత్తించారు. సభకు కోనసీమ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీగా జనసందోహం తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. టీడీపీ, జనసేనకు చెందిన ఉమ్మడి జిల్లా స్థాయి నేతలంతా వేదికపై ఆశీనులయ్యారు. ఇరుపార్టీలకు చెందిన కేడర్ కూడా సభకు పోటెత్తారు. చంద్రబాబునాయుడు 50 నిమిషాలపాటు తన ప్రసంగంతో సభికులను ఉర్రూతలూగించారు. టీడీపీ, జనసేన శ్రేణుల్లో నూతనోత్తేజం నింపారు. కోనసీమలోని ఇద్దరు మంత్రులు, నలుగురు వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని సభలో ఎండగట్టారు. మండపేట వైసీపీ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు ఇసుక, గ్రావెల్‌లో రూ.500 కోట్లు సంపాదించారని చంద్రబాబు ఆరోపించారు. పార్టీల పల్స్ పట్టుకుని పిరాయించే ఎమ్మెల్సీ, మండపేట ఇన్‌చార్జ్ తోట త్రిమూర్తులకు ఈసారి అటువంటి అవకాశం ఇచ్చేదే లేదంటూ పరోక్షంగా తేల్చిచెప్పారు. చెల్లని మంత్రి చెల్లుబోయిన, మంత్రి విశ్వరూప్ అవినీతి, రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, కొండేటి చిట్టిబాబుల అవినీతి దందాలతో పాటు కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని చిల్లర జగ్గిరెడ్డిగా అభివర్ణిస్తూ ఆయన చేస్తున్న ఇసుకదోపిడీపై మండిపడ్డారు.ఇక జగన్ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహావిష్కరణను గొప్పగా చెప్పుకుంటోందని, అయితే జగన్ దళితుల సంక్షేమ పథకాలు 27 రద్దు చేసి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించి దళితులపై అక్రమ కేసులు బనాయించిన తీరును ఎండగట్టారు. దళితులు, బీసీలకు సీట్ల కేటాయింపులో చేస్తున్నది అన్యాయమేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డు వచ్చేలా అప్పటి నేషనల్ ఫ్రంట్ చైర్మన్ హోదాలో ఎన్టీఆర్ చేసిన కృషితో పాటు దివంగత బాలయోగి నుంచి దళిత నేతలను ఉన్నత స్థితికి ఎలా పంపించిందీ ప్రస్తావించి దళితులపై దాడులను ఎండగట్టారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి, అన్నదాతల ఆత్మహత్యలు, కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు ఇలా అన్ని రంగాలను జగన్ నిర్వీర్యం చేస్తున్న తీరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సభికులను ఆకర్షించారు. తెలుగుజాతి స్వర్ణయుగం కోసం రా కదలిరా, సాగునీటి ప్రాజెక్టుల కోసం.. వ్యవసాయాన్ని బతికించడంకోసం.. రోడ్ల బాగు కోసం.. మన బిడ్డల ఉద్యోగాల కోసం.. ఆడ బిడ్డల రక్షణ కోసం.. నిజమైన సామాజిక న్యాయం కోసం.. సైకో పాలన అంతం కోసం రా కదలిరా అంటూ చంద్రబాబు సభికుల చేత చేయించిన నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. తెలుగుదేశం, జనసేన ఐక్యత వర్ధిల్లాలంటూ చంద్రబాబు నినాదాలు ఇచ్చి ఇరుపార్టీల జెండాలను వేదికపై ఊపడంతో సభను ముగించారు. అనంతరం 30 మంది వైసీపీ నేతలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. తొలుత అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్, జ్యోతుల నవీన్‌ల ఆధ్వర్యంలో భారీ గజమాలతో చంద్రబాబును వేదికపై సత్కరించారు.ఇక టీడీపీకి చెందిన లోక్‌సభ ఇన్‌చార్జ్ హరీష్‌తో పాటు కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, జనసేన లోక్ సభ ఇన్‌చార్జ్ డీఎంఆర్ శేఖర్‌తో పాటు టీడీపీ, జనసేనలకు చెందిన ఏడు నియోజవర్గాలకు చెందిన ఇన్‌చార్జ్‌లతో సభలో మాట్లాడించారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం సభను సమన్వయంతో నడిపించారు. ప్రశాంత పరిస్థితుల నడుమ సుమారు రాత్రి 7 గంటల సమయంలో ముగిసింది.



పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



అయితాబత్తుల ఆనందరావు



వేగుళ్ల లీలాకృష్ణ



బండారు సత్యానందరావు



వరుపుల సత్యప్రభ



కేఎస్ జవహర్





చంద్రబాబు వరాల జల్లు

గోదావరిలపై వంతెన నిర్మాణ బాధ్యతలను వచ్చే టీడీపీ, జనసేన నూతన ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ముమ్మిడివరంలో గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తాం. రూ.45 కోట్ల వ్యయంతో గుత్తెనదీవి-గోగులంక వంతెన నిర్మిస్తాం. బాలయోగి చిరకాలవాంఛ అయిన కోనసీమ రైల్వే లైను పూర్తిచేస్తాం. నర్సాపురం- సఖినేటిపల్లి వంతెన, కోటిపల్లి, ముక్తేశ్వరం వంతెనలను పూర్తిచేస్తామని హామీ ఇస్తున్నా. కొబ్బరిదింపు, ఒలుపు కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తాం. నష్టపోయిన కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఏ విధంగా న్యాయం చేయాలో చేసి చూపిస్తామని చంద్రబాబు వరాల వర్షం కురిపించారు.

అవినీతికి పాల్పడినా రెడ్లను మార్చరు.. బీసీ.. ఎస్సీలను మార్చేస్తారు?

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి కోనసీమ జిల్లాకు చెందిన అధికార వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సుమారు 50 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించారు. ఇద్దరు మంత్రులతో సహా వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై నిప్పులు చెరిగారు. మండపేట వైసీపీ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులలు ఏకంగా తాతపూడి ర్యాంపు, గ్రావెల్ కొండల్లో రూ.500 కోట్లు కొట్టేశాడు. ఇళ్ల పట్టాల పేరుతో రూ.20 లక్షలు కూడా విలువచేయని భూమిని రూ.50 లక్షలకు కొనుగోలు చేయించారు. రౌడీయిజం చేస్తున్నారు..కాలేరు గ్రామంలో ఐదుగురు దళితుల యువకులపై రౌడీషీట్ ఓపెన్ చేయించారు. ఇద్దరు సర్పంచ్‌లపై కేసులు పెట్టారు.రేపు మీకూ ఇదే గతి తప్పదని చంద్రబాబు హెచ్చరించారు. ఒక్క కేసు పెడితే 100 కేసులు పెట్టే సత్తా టీడీపీ, జనసేనకు ఉంది. ప్రశాంతతకు మారుపేరైన మండపేటలో మళ్లీ వేగుళ్ల జోగేశ్వరరావునే ఎమ్మెల్యేగా గెలిపించాలి. మండపేట వైసీపీ ఇన్‌చార్జి చాలా తెలివైనవాడు. ఆయారాం.. గయారాంలను దూరంగా ఉంచుతామని చంద్రబాబు ప్రకటించారు. రామచంద్రపురంలో చెల్లని కాసు మంత్రి చెల్లుబోయిన వేణు. సుబ్బారెడ్డి కాళ్ల మీద పడి బీసీల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టాడు. ఇక్కడ నుంచి రాజమహేంద్రవరం రూరల్‌కు జగన్ పంపించాడు. అక్కడ నుంచి దుకాణం సర్దుకునే రోజులు దగ్గరపడ్డాయని వ్యంగ్యంగా విరుచుకుపడ్డారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఇళ్ల స్థలాల కోసం రూ.15 లక్షలు కూడా విలువచేయని భూమిని రూ.30 లక్షలకు కొనుగోలు చేయించారు. లేఅవుట్ వేయాలంటే ఆయనకు కమీషన్ ఇవ్వాలి. యానాం నుంచి అక్రమ మద్యం తెచ్చి అమ్ముతున్నారు. అమలాపురం మంత్రి విశ్వరూప్ అనుచరుల అవినీతికి అడ్డుఅదుపూలేదు. రాజోలులో ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ జనసేన నుంచి గెలిచి వైసీపీలోకి వెళ్లారు. ఆయన పెళ్లి ఒకచోట..కాపురం మరొక చోట. కత్తిమండలో అక్రమ సొమ్ముతో ఐదెకరాల స్థలంలో సుందరమైన భవంతిని నిర్మించుకున్నాడు. చింతలమోరి సముద్రతీరంలో పేదల భూమిని కొట్టేశారు. అలాగే పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అక్రమాలను ఎండగట్టారు. అయనను ప్రస్తుతం జగన్ పక్కనపెట్టారు. ఇక కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిపై చిల్లర జగ్గిరెడ్డి అంటూ అవినీతిపై వ్యంగాస్త్రాలు సంధించారు. బీసీ, ఎస్సీలకు చెందిన వైసీపీ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు లేవు. ఇచ్చినా సీట్లు మార్చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే రెడ్లకు మాత్రం సీట్ల మార్పు లేదు. హోల్‌సేల్ కరప్షన్ కింగ్ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారం పూడి చంద్రశేఖర్‌రెడ్డిని మార్చలేదు.అనపర్తి వైసీపీ ఎమ్మెల్యే సత్తి సూర్య నా రాయణరెడ్డిని మార్చలేదు.ఇదీ సామాజిక న్యా యం అంటే అని చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సం ధించారు.సీఎం జగన్ పెద్దతిమింగళం అయి తే వీరంతా చిన్న చిన్న తిమింగళాలు. అవినీతికి పాల్పడిన మిమ్మల్ని ప్రజాకోర్టులో శిక్షించే బా ధ్యత టీడీపీ, జనసేన ప్రభుత్వం తీసుకుంటుంది.

సైకో పోవాలి.. సైకిల్ రావాలి

మీ పిల్లల భవిష్యత్ బాగుండాలంటే సైకో పోవాలి.. సైకిల్ రావాలి. ఎన్ని రోజులు భయపడతారు. పవన్‌కల్యాణ్ హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి రావాలంటే పాస్‌పోర్టు కావాలా అని ప్రశ్నించారు. వైసీపీలో బూతులు ఎక్కువ తిట్టినవారికే ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశా రు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లన్నీ పూర్తిచేసి ప్రతి ఒక్కరికి ఇళ్లిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. టీడీపీ బలపరుస్తున్న వారి పింఛన్లను వైసీపీ రద్దుచేసింది. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో రద్దు చేసిన నాటి నుంచి వారందరికీ పింఛన్లు ఇస్తామని ప్రకటించారు.









బాబుతో చినరాజప్ప, గోరంట్ల చంద్రబాబుకు పుష్పగుచ్ఛం, నమస్కరిస్తున్న నాయకులు



మనదే విజయం : చంద్రబాబు అభివాదం



జిల్లా కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కృష్ణవేణి

అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపులు ఆపాలి

అమలాపురంలో అంగన్‌వాడీల రాస్తారోకోలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి

అమలాపురం టౌన్, జనవరి 20: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగడం శోచనీయమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీల ఉద్యమానికి సంఘీభావంగా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన రాస్తారోకోను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు సమ్మెను ప్రారంభించి 40 రోజులు పూర్తయినా సీఎం జగన్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలుచేయమని నిరవధిక సమ్మెకు దిగితే ప్రభుత్వం అంగన్‌వాడీలపై బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. అధికారుల బెదిరింపులతో ఇప్పటికే జిల్లాలో ఇద్దరు గుండెపోటుతో మృతి చెందారని ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. సీఎం జగన్ ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి అంగన్‌వాడీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరపాలన్నారు. జగనన్నకు చెబుదాం పేరుతో కోటి సంతకాలు సేకరించామన్నారు. తొలుత ఉద్యమంలో మృతి చెందిన అంగన్‌వాడీల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. శిబిరంలో జిల్లా అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయలక్ష్మి, కె.బేబిగంగారత్నం, మహేశ్వరి, సూర్యకళ, రత్నకుమారిలు పాల్గొన్నారు.





జొన్నాడ ఇసుక ర్యాంపు వద్ద ఆందోళన చేస్తున్న లారీ యజమానులు.. గోపాలపురం ర్యాంపును సందర్శించిన టీడీపీ నేతలు

ఇసుక ర్యాంపులో బాటచార్జీల బాదుడు

బాట నిర్వహణ పేరుతో దోపిడీ.. వ్యతిరేకించిన వాహన యజమానులు.. నిలిచిపోయిన ఇసుక తవ్వకాలు

ఆలమూరు, జనవరి20: సామాన్యులపై ప్రభుత్వం మరో బాదుడు మొదలుపెట్టింది. మునుపెన్నడు లేనివిధంగా ర్యాంపుల్లో బాటచార్జీల పెంచేశారు. ట్రాక్టర్ నుంచి భారీ లారీల వరకు ఏ వాహనానికీ మినహాయింపు లేకుండా చార్జీలు వసూళ్లు మొదలుపెట్టారు. దీంతో వాహనదారులు ఈ విధానాన్ని వ్యతిరేకించి ఉభయగోదావరి జిల్లాల్లో ర్యాంపుల వద్ద నిరసన వ్యక్తంచేసి వాహనాలను నిలుపుదల చేశారు. ర్యాంపుల్లో ఇసుక యూనిట్ లేదా టన్ను ఆధారంగా చెల్లింపులు జరిగేవి. అయితే శనివారం 20 నుంచి కొత్త విధానాన్ని ర్యాంపు నిర్వాహకులు తీసుకొచ్చారు. ప్రస్తుతం టన్నుల ధరతోపాటు రవాణా చార్జీలను మాత్రమే వారి వద్ద నుంచి తీసుకోవడం జరుగుతుందని, ఈ అదనపు చార్జీలతో వినియోగదారుడు చెల్లించే పరిస్థితి కనిపించడం లేదని, అందుకునే తాము పూర్తిగా బాటచార్జీల వసూళ్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు వాహనదారులు చెప్పారు. చార్జీలు తగ్గించేంతవరకు ర్యాంపుల్లో ఎగుమతులు చేసుకునేది లేదని వారు తేల్చిచెప్పారు. దీంతో శనివారం జొన్నాడ ఇసుక ర్యాంపులో తవ్వకాలు నిలిచిపోయాయి.

గోపాలపురం ర్యాంపులో..

రావులపాలెం, జనవరి 20: ఇసుక చార్జీల పెంపుపై లారీ యూనియన్ నాయకులు, డ్రైవర్లు నిరసన చేపట్టారు. గోపాలపురం ర్యాంపునకు చేరుకున్న వాహనాదారులు, లారీ యూనియన్ నాయకులు ధరలు పెంపును నిరసిస్తూ శనివారం ఇసుక రవాణాను నిలుపుదల చేశారు. నిరసన తెలుపుతున్న వారికి టీడీపీ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గ్రామపార్టీ అధ్యక్షుడు అధికారి నాగుతోపాటు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. చార్జీలు తగ్గించే వరకు నిరసన కొనసాగిస్తామని లారీ యూనియన్ నాయకులు తెలిపారు.





వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం... వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.30.13 లక్షలు

ఆత్రేయపురం, జనవరి 20: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి అలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర సేవలను నిర్వహించి స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో బారులుతీరి స్వామివారిని దర్శించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.30.13 లక్షలు లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజులు తెలిపారు.

వీరేశ్వరుని 150 రోజుల ఆదాయం రూ. 24.90 లక్షలు

ఐ.పోలవరం, జనవరి 20: మురమళ్ల వీరేశ్వరస్వామి 150 రోజుల ఆదాయం రూ.24,90,665 వచ్చినట్టు ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. చైర్మన్ పెన్మెత్స వాసురాజు ఆధ్వర్యంలో తనిఖీదారు రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. తొలుత ఆలయ అర్చకులు హుండీకి హారతి ఇచ్చారు. ప్రధాన హుండీ ద్వారా రూ.12,38,089, నిత్యకల్యాణ కట్నకానుకల ద్వారా రూ.10,69,539, అన్నదాన హుండీ ద్వారా రూ.1,83,037 ఆదాయం సమకూరింది. గతం కంటే ఈసారి అదనంగా రూ.4,91,011 ఆదాయం వచ్చింది.

‘అంగన్వాడీ’ అస్తవ్యస్తం

- పోషకాహారం పక్కదారి
- అందరికీ అందినట్లు అవాస్తవాలు
- జిల్లాలో లక్షమంది వరకూ లబ్ధిదారులు
- అంగన్వాడీల యాప్ ఆపేసి..
- వలంటీర్లకు కొత్త యాప్
- రిజిస్టర్‌లో నమోదు లేదు!


ఓ కేంద్రంలో కుళ్లిన గుడ్లు(ఫైల్)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం జగమొండి మంకుపట్టుతో 40 రోజులుగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిర్దేశిత సమయం ప్రకారం అందాల్సిన పౌష్టికాహారం క్రమం తప్పింది. ఈ ప్రభావం వారి ఆరోగ్యంపై చూపిస్తుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని అంగన్వాడీల్లో కొంత పౌష్టికాహారం పక్కదారి పడుతుండగా మరికొంత ఎలుకల పాలవుతోంది. దీనిపై లబ్ధిదారులు మండిపడుతుండగా పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించి విసిగిపోయిన అంగన్వాడీలు పోరాటానికి రోడ్డెక్కిన విషయం తెలిసిందే. ఇటు అంగన్వాడీ మహిళలు 40 రోజులుగా ఇబ్బందులు పడుతున్నా.. అటు బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నా ప్రభుత్వం మాత్రం ‘వినబడలే’ అన్న మాదిరిగా వ్యవహరిస్తోంది. దీంతో అంగన్వాడీ సెంటర్లు అస్తవ్యస్తంగా మారాయి. మరోవైపు సెంటర్‌కి తీసుకెళ్లమని మారాం చేస్తున్న పిల్లలతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఓ కానిస్టేబుల్ తన చిన్నారిని రోజూ సముదాయించలేక అంగన్వాడీల సమ్మెపై వెంటనే నిర్ణయం తీసుకొని విరమింపజేసే విధంగా చూడాలని కలెక్టర్‌కి అర్జీ ఇద్దామనే ఆలోచన చేశారంటే అంగన్వాడీలతోపాటు లబ్ధిదారులు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

గతి తప్పిన సెంటర్లు

తూర్పుగోదావరి జిల్లాలో 1556 సెంటర్లలో సుమారు లక్ష మంది వరకూ ప్రీస్కూల్, 6నెలల నుంచి 3ఏళ్లలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆహారం పేరిట పౌష్టికాహారం పొందుతున్నారు. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం సమ్మెట పెట్టడంతో సెంటర్లు గతి తప్పాయి. లబ్ధిదారుల గురించి అంగన్వాడీలకు పూర్తి సమాచారం ఉంటుంది. పిల్లలతో అనుబంధం పెనవేసుకుపోతుంది. అందువల్ల ఎవరికైనా పౌష్టికాహారం అందకపోయినా ఫోన్ చేసి లేదా ఇంటికి వెళ్లి అందజేస్తారు. అయితే, అంగన్వాడీలు సమ్మెకు దిగిన రోజున ప్రభుత్వం నియంతృత్వంగా అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టించింది. సచివాలయ ఉద్యోగులను అక్కడ నియమించింది. వాళ్లకు ఆ విధులు అలవాటు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి దాపురించింది. కనీసం అంగన్వాడీ సెంటర్లను శుభ్రం చేయడం లేదు. డ్యూటీకి వచ్చారనే నిర్ధారణ కోసం సెల్ఫీలు దిగి వెళ్తున్నారు. లబ్ధిదారులు కూడా సెంటర్లకు వెళ్లడం లేదు. వాళ్లూ అంగన్వాడీలకే మద్దతు పలుకుతున్నారు. సెంటర్లలో పిల్లల ఆట వస్తువులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర మెటీరియల్ గురించి అంగన్వాడీలు ఆవేదన చెందుతూనే ఉన్నారు.

‘సంపూర్ణం’గా అందడం లేదు

అంగన్వాడీలకు ఒక యాప్ ఉంటుంది. లబ్ధిదారుల వివరాలు దానిలో ఉంటాయి. వారికి సంపూర్ణ ఆహారం అందజేసినపుడు యాప్‌తో పాటు రిజిస్టరులోనూ వివరాలు నమోదు చేసి తీసుకున్నట్లు సంతకం తీసుకుంటారు. అయితే, సమ్మె కారణంగా ప్రభుత్వం అంగన్వాడీల సంపూర్ణ ఆహారం యాప్‌ని లాగిన్ కాకుండా నిలిపివేసింది. వలంటీర్లకు కొత్త యాప్ ఇచ్చింది. దానిలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లడానికి నానా తంటాలూ పడుతున్నారు. దీంతో లబ్ధిదారులకు సంపూర్ణంగా పౌష్టికాహారం అందడం లేదు. పండుగ సందర్భంగా అంగన్వాడీలు తమ సమ్మెకు మద్దతుగా లబ్ధిదారుల నుంచి కోటి సంతకాల క్యాంపెయిన్ నిర్వహించారు. ఒక్కో సెంటరు నుంచి కనీసం 300 సంతకాలు సేకరించారు. ఈ సమయంలో లబ్ధిదారుల ఇంటికి తాము వెళ్లిన సమయంలో చాలాచోట్ల అవకతవకలు బయటపడ్డాయని అంగన్వాడీలు అంటున్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్‌లోని ఓ సెంటరులో 9 మంది బాలింతలు, గర్భిణులు ఉండగా వారిలో నలుగురికి మాత్రమే సంపూర్ణ ఆహారం అందజేసి అందరికీ ఇచ్చేసినట్టు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గుడ్లు రాలేదని.. ఒకవేళ వచ్చినా ఇచ్చిన కాడికి మమ అనిపించి సంపూర్ణ ఆహారాన్ని గుటుక్కుమనిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పౌష్టికాహారం ఇదీ..

జనాభా ఆధారంగా ఒక్కో సెంటర్‌లో 30 నుంచి 90 మంది వరకూ లబ్ధిదారులు ఉన్నారు. సంపూర్ణ ఆహారం పేరుతో గర్భిణులు, బాలింతలకు నెలలోని 1 నుంచి 6వ తేదీ వరకూ మొదటి విడత, 10-20వ తేదీలోపు రెండో విడత, 20-31 తేదీలోపు మూడో విడత కింద.. 1-15వ తేదీలోపు ఒక్కొక్కరికి 13గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలసంజీవిని కిట్(కర్జూరం 250గ్రా, బెల్లం 250గ్రా, పల్లీలఅచ్చు 250గ్రా, రాగిపిండి 2కిలోలు, అటుకులు 1కిలో), బియ్యం 3కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అర లీటరు. రెండో విడత పంపిణీ కింద 16-30వ తేదీలోపు 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తారు. మొత్తంగా నెలకు బాలసంజీవిని కిట్ 1, గుడ్లు 25, పాలు 5 లీటర్లు రైస్ 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అరలీటరు అందజేస్తారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు నెలకు 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్ ఇస్తారు. 3-5ఏళ్లలోపు ప్రీస్కూల్ పిల్లలకు రోజూ గుడ్డు, పప్పుతో భోజనం, 100 మిల్లీ లీటర్ల పాలు అందజేస్తారు. ఇప్పుడు వీటిలో ఎందరికి ఏవి అందుతున్నాయో అయోమయం నెలకొంది.


వేదికపై చంద్రబాబుకు నమస్కరిస్తున్న నేతలు

చంద్రబాబు ‘రా కదలిరా’ సభ విజయవంతం

స్ఫూర్తినింపిన నేతల ప్రసంగాలు

మండపేట, జనవరి 20 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శనివారం రా..కదలిరా.. బహిరంగ సభ విజయవంతమైంది. ముఖ్యంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రసంగంతో టీడీపీ, జనసేన శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చింది. ఈ బహిరంగ సభకు అమలాపురం పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి అనంతలక్ష్మి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, తొలుత టీడీపీ, జనసేనకు చెందిన పార్టీ నాయకులు ప్రసంగించారు.

ఈ రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల జగన్ పాలన చూశాం. గతంలో టీడీపీ పాలన చూశాం. టీడీపీ పాలనలో మండపేట నియోజకవర్గంలో రూ.500 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశాం. రూ 495 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందించాం. మండపేట నియోజకవర్గాన్ని పాలనా సౌలభ్యం కోసం రాజమహేంద్రవరంలో కలపాలని చంద్రబాబునాయుడును కోరాం. ఇక్కడ వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమలాపురంలో ఆయన ఆస్తులు ఉన్నందున మండపేటను కోనసీమలో కలిపారు. మండపేట శాంతియుతంగా ఉండేది. ఇక్కడకు తోట రౌడీయిజం తీసుకువచ్చారు.

వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట ఎమ్మెల్యే

నాన్న బాలయోగి ఆశయ సాధనకు కృషి చేస్తా.. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు సీఎం కావడమే లక్ష్యంగా పనిచేస్తా. కోనసీమలో బాలయోగి హయాంలో చేపట్టి మధ్యలో నిలిచిపోయిన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చంద్రబాబు సహకారంతో కృషి చేస్తా.

గంటి హరీష్‌మాధుర్, టీడీపీ పార్లమెంట్ నేత

మండపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన సంయుక్తంగా ఉమ్మడి అభ్యర్థిని 50 వేల మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇస్తాం. ఇక్కడ నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తమకు చంద్రబాబు సహకరించాలని కోరాం.

వేగుళ్ల లీలాకృష్ణ, మండపేట జనసేన ఇన్‌చార్జి

ఈ రాష్ట్రంలో జగన్ రాజ్యాంగం నడుస్తోంది. సామాన్యులు, మధ్య తరగతికి చెందిన వారికి రక్షణ లేదు. రాజ్యాంగానికి లోబడి కనీస పాలన సాగించడం చేతకాని ముఖ్యమంత్రి జగన్. బాబు, పవన్ సారథ్యంలో ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. జగన్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలి.

గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి

రాష్ట్రంలో పరిస్థితులను అర్థం చేసుకుని పవన్ టీడీపీతో కలిసి పనిచేస్తున్నారు. ఆయన అధికారం కోసం కాదని ప్రశ్నించటం కోసం పార్టీ పెట్టానని చెప్పటం గొప్ప విషయం. చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు పెట్టినపుడు బాబుకు అండగా నిలిచిన పవన్ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా టీడీపీతో కలిసి పనిచేయాలని నిర్ణయించడం హర్షణీయం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ 34 శాతం టీడీపీ చేస్తే ఈ ప్రభుత్వం 24 శాతం చేసింది.

రెడ్డి సుబ్రహ్మణ్యం, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్

వైఎస్ జగన్ దళిత ద్రోహి. 27 దళిత పథకాలను రద్దు చేసి అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరును జగన్ విదేశీ విద్యగా పేరుమార్చిన దుర్మార్గుడు జగన్. అలాంటి వ్యక్తికి దళితుల ఆరాధ్య దైవం అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించే అర్హత లేదు.

అయితాబత్తుల ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే

కోడికత్తి డ్రామాతో అధికారంలోకి వచ్చిన జగన్ దళితుడైన కోడికత్తి శ్రీనుకు ఐదేళ్ల నుంచి బెయిల్ రాకుండా ఎందుకు చేస్తున్నాడో సమాధానం చెప్పాలి. దళితులపై కపట ప్రేమ తప్ప ప్రేమ లేదు. టీడీపీ హయాంలో గ్రామాల్లో సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. పెళ్లి కానుక అన్న క్యాంటీన్, సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫా అందిస్తే ఈ ప్రభుత్వం వాటికి మంగళం పాడింది.

దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే

రా కదలిరా సభకు బాబు రాకతో సంక్రాంతి కళ కొనసాగింది. ఇదే సంక్రాంతి ఇంటింటా కావాలంటే టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలి. వైసీపీ పాలనను తుద ముట్టించేందుకు టీడీపీ జనసేన శ్రేణులు అంతా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్‌కు ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రం సర్వనాశనం చేశాడన్నారు. కొత్తపేటలో దళిత యువకులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. టీడీపీ జనసేన వారిపై వేధింపులు గురిచేస్తున్నారన్నారు.

బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే

టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం. పవన్ సారథ్యంలో టీడీపీతో కలిసి పనిచేస్తాం. ప్రజలకు మంచి ప్రభుత్వాన్ని అందించేందుకు కృషి చేస్తాం.

పితాని బాలకృష్ణ, ముమ్మిడివరం జనసేన ఇన్‌చార్జి

రాష్ట్రంలో టీడీపీ జనసేన అధికారమే లక్ష్యంగా పనిచేసి వైసీపీని ఓడిస్తాం. రాష్ట్రంలో పరిశ్రమలు లేక యువతకు ఉపాధి అవకాశాలు రాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు తరలిపోతున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి.

శెట్టిబత్తుల రాజబాబు, జనసేన అమలాపురం ఇన్‌చార్జి

ఈ ప్రభుత్వం గంజాయికి ఏపీని అడ్డగా మార్చేసింది. ఇసుక గ్రావెల్ మట్టి దోపిడీకి అంతం లేకుండా పోయింది. పవన్ ప్రశ్నించటం కోసం, ప్రజా సంక్షేమం కోసం బాబుతో కలిశారు. ఈసారి గెలుపే లక్ష్యంగా ఇరుపార్టీలు పనిచేస్తాయి.

బండారు శ్రీనివాసరావు, కొత్తపేట జనసేన ఇన్‌చార్జి

టీడీపీ జనసేన ఉమ్మడిగా ఈసారి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం. ఈ రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలి

పెద్దకాపు, రాజోలు జనసేన ఇన్‌చార్జి

టీడీపీ, జనసేన ఒకే మాట ఒకే బాటగా ఎన్నికలలో కలిసి పనిచేసి వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేసి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం అంతా కలిసికట్టుగా పనిచేయాలి

పోలిశెట్టి చంద్రశేఖర్. రామచంద్రపురం జనసేన ఇన్‌చార్జి

మూడు రోజుల పాటు నారా భువనేశ్వరి

‘నిజం గెలవాలి’ యాత్ర

బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు ఉమ్మడి జిల్లాలో పర్యటన

కాకినాడ సిటీ, రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి), జనవరి 20: నిజం గెలవాలి.. కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 24నుంచి మూడు రోజుల పాటు కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఆమె పర్యటిస్తారు. వైసీపీ ప్రభుత్వం టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా 24న కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, 25న అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, 26న రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో ఆమె పర్యటిస్తారు.

పర్యటన వివరాలు..

24వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 12.30 గంటలకు జగ్గంపేట మండలం గుర్రపాలెం గ్రామం, 1.25 గంటలకు పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామం, సాయంత్రం 4.05 గంటలకు తుని రూరల్ మండలం తేటగుంట గ్రామం, 5.20 గంటలకు కాకినాడ నగరంలోని 26వ డివిజన్‌లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. రాత్రికి ముమ్మిడివరం నియోజకవర్గం మహిపాల చెరువు వద్ద జాతీయ రహదారి పక్కన గ్రాండ్ పార్క్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు.

25వ తేదీ ఉదయం 10.30 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం, 11.45 గంటలకు అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, 12.25 గంటలకు అల్లవరం మండలం రెల్లుగడ్డ, 2.40 గంటలకు రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం, సాయంత్రం 5.25 గంటలకు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం నల్లూరు, 6.20 గంటలకు మండపేట మండలం పాలతోడు గ్రామంలో పర్యటిస్తారు. రాత్రికి అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం చేరుకుని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు.

26వ తేదీ ఉదయం 10.25 గంటలకు బిక్కవోలు, 12.40 గంటలకు నిడదవోలు మండలం పందలపర్రు, 1.20 గంటలకు తిమ్మరాజుపాలెం, 1.55 గంటలకు తాడిమళ్ల, 3.15 గంటలకు గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

బాబు సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు

- వైసీపీ యువనేత వాసంశెట్టి సుభాష్ అనుచరులతో చేరిక
- పార్టీ తీర్థం పుచ్చుకున్న రామచంద్రపురం పారిశ్రామిక వేత్తలు
- టీడీపీలో చేరిన డాక్టర్ కాదా వెంకటరమణ


బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుభాష్, సత్యం


పార్టీలో చేరిన కాదా వెంకటరమణ

మండపేట, జనవరి 20: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ నుంచి, ఇతర ప్రముఖులు కొందరు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గానికి చెందిన వైసీపీ యువనేత వాసంశెట్టి సుభాష్ పార్టీకి రాజీనామా చేసి అతని అనుచరులతో కలసి శనివారం మండపేటలో జరిగిన టీడీపీ రా కదలిరా సభలో టీడీపీలో చేరారు. అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ నేత గుణ్ణం చంద్రమౌళి తదితర టీడీపీ నేతల ఆధ్వర్యంలో చంద్రబాబు చేతుల మీదుగా సుభాష్ పచ్చకండువా కప్పుకున్నారు. సుభాష్‌తోపాటు వైసీపీకి చెందిన అడపా సతీష్, దొంగ శ్రీను, గుత్తుల నాగేంద్ర, నరసింహం తదితరులు కూడా టీడీపీలో చేరారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, వైద్యులు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు.. నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం సారథ్యంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో ప్రముఖ వైద్యులు కాకినాడ సత్య సిటి స్కానింగ్ సెంటర్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ, పారిశ్రామికవేత్త మేడిశెట్టి శేషారావు, ఆయన సతీమణి మేడిశెట్టి వెంకటలక్ష్మి, కౌన్సిలర్ కవల లక్ష్మీఅనసూయ, ఆమె కుమారుడు నానాజీ, వైద్యులు డాక్టర్ మడకా రాంబాబు, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, డాక్టర్ రఘువీర్‌కాంత్, మాజీ సర్పంచ్ సుంకర చినకాపు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు పలివెల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ దంగేటి వెంకటరమణ తదితరులు టీడీపీలో చేరారు. అలాగే మండపేట పట్టణానికి చెందిన అధికార పార్టీ వైకాపా కౌన్సిలర్ కొవ్వాడ బేబి, ఆమె భర్త అప్పన్నబాబుతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు సమక్షంలో పార్టీలో చేరారు. వారితోపాటు మాజీ సహకార సంఘ అధ్యక్షుడు కుక్కల రామారావు తదితరులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిని బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జేకే భారవికి వేటూరి పురస్కారం



తుని రూరల్, జనవరి 20: వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ కల్చరల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేటూరి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ప్రదానం చేసే వేటూరి పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే భారవికి అందజేయనున్నారు. ఈ నెల 29న జేకే భారవికి వేటూరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ తెలిపారు. ఈనెల 29న తునిలో చిట్టూరి మెట్రో నందు ఈ వేడుక అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

మండపేట సీటు వేగుళ్లకే : చంద్రబాబు

మండపేట, జనవరి 20: టీడీపీ కంచుకోట మండపేటలో మూడుసార్లు వరుసగా వేగుళ్ల జోగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిపొందారని, ఈసారి కూడా ఇక్కడ నుంచి వేగుళ్లను నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజలను కోరారు. మండపేటలో శనివారం జరిగిన రా కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. మండపేట నియోజకవర్గం నుంచి 50 వేల మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ చంద్రబాబు సాక్షిగా ప్రకటించారు. దీంతో ఇక్కడ నాలుగోసారి భారీ మెజార్టీతో వేగుళ్ల విజయం తథ్యమని టీడీపీ, జనసేన శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి

రూ.20 అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ స్టాంప్‌ని వెంటనే రద్దు చేయాలి: ముప్పాళ్ల



రాజమహేంద్రవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంక్షేమ చట్టాన్ని(అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్టు) వెంటనే సవరించి రూ.20 స్టాంప్‌ను రద్దు చేయాలని లేదా ఆర్డినెన్స్ ద్వారా ఆ స్టాంప్‌ని నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉమ్మడి బార్ కౌన్సిల్‌గా ఉన్నప్పుడు చేసిన తీర్మానం ప్రకారం ఇటీవల కాలంలో అన్ని క్రిమినల్, మిస్‌లేనియస్, మధ్యంతర పిటిషన్లపై రూ.20 అడ్వొకేట్ వెల్ఫేర్ ఫండ్ స్టాంప్‌ని తప్పనిసరిగా అంటించాలని ఏపీ ప్రభుత్వం చట్ట సవరణ చేయడం శోచనీయమన్నారు. దీనిపై ఇప్పటికే న్యాయవాదులు ఆందోళనలు నిర్వహించారని గుర్తుచేశారు. దీంతో రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దీనిలో మెజారిటీ బార్ అసోసియేషన్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అత్యవసర బార్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో రూ.20 స్టాంప్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, మెమో అప్పీరెన్స్, వకాలత్‌లపై అప్పటి వరకూ ఉన్న రూ.100 వెల్ఫేర్ స్టాంప్‌ను రూ.250కు పెంచాలనే బార్ అసోసియేషన్ల నిర్ణయం మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి చాలాకాలం గడిచిందని తెలిపారు. న్యాయవాదుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ఆ తీర్మానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 స్టాంప్‌ని తక్షణమే రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ క్రీడాకారులుగా ఎదగాలి

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్ కృతికా



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ రూరల్, జనవరి 20: ప్రపంచం గర్వించదగ్గ క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కృతికాశుక్లా పోటీలను ప్రారంభించారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడా జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ క్రీడలు ప్రతీ ఒక్కరిలోనూ ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు. ఈనెల 24 వరకూ ఈ పోటీలు కొనసాగుతాయని పాఠశాల విద్య జోన్ 2 ఆర్జేడీ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవో జి.నాగమణి తెలిపారు. అండర్-19 పాఠశాల క్రీడా సమాఖ్య పురుషుల లాన్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలకు 24 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు, 46 మంది కోచ్ మేనేజర్లు హాజరయ్యారని తెలిపారు. పోటీలను కాకినాడ డీఎస్ఏ, పాత ఎస్పీ కార్యాలయం వెనుక, డీమార్ట్ సమీపంలోని సింథటిక్ టెన్నిస్ కోర్టులలో నిర్వహించనున్నామని పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుడా చైర్మన్ చంద్రకళాదీప్తి,ఏఎస్పీ బి.సత్యనారాయణ, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వహణా కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, కర్రి భామిరెడ్డి, డీవైఈవోలు ఆర్జే డేనియల్‌రాజు, డి.సుభద్ర, డీసీఈబీ వెంకట్రావు, సీఎంవో నాగేశ్వరరావు, ఎంఈవోలు గణేష్‌బాబు, వాణీకుమారి, రవి, పుల్లయ్య డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, పీడీలు రంగారావు, రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, పట్టాభి శ్రీనివాస్, ప్రసాద్, కోచ్‌లు, మేనేజర్లు, అరవిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు


సామర్లకోట, జనవరి 20: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ కారిడార్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ నెల నుంచి విజయవాడ-విశాఖల మధ్య సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే ఏటీఎం చార్జీ ఏ. సురేష్‌రెడ్డి శనివారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి లేఖ పంపారు. 17239 నంబరు గల గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ రద్దు చేశారు. 17240 నంబరు గల విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 26 వరకూ రద్దు చేశారు. 17267 నంబరు గల కాకినాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే రైలును ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ రద్దు చేశారు. 17268 నంబరు గల విశాఖ-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే రైలును ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ రద్దు చేశారు.

17219 నంబరు గల మచిలీపట్నం-విశాఖ మధ్య రాకపోకలు సాగించే రైలును ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ రద్దు చేశారు. 17220 నంబరు గల విశాఖ-మచిలీపట్నం మధ్య రాకపోకలు సాగించే రైలును ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 26 వరకూ రద్దు చేశారు. 17243 నంబరు గల గుంటూరు-రాయగడ మధ్య రాకపోకలు సాగించే రైలును ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ రద్దు చేశారు. 17244 నంబరు గల రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే రైలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 26 వరకూ రద్దు చేశారు.

యానాం మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

యానాం, జనవరి 20: యానాం మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశంపై పుదుచ్చేరి ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెన్షన్ వేటు వేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా హోం టౌన్ (విధులు నిర్వహించే ప్రాంతం) యానాం వదిలి బయటకు వెళ్లరాదని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈమేరకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఆదేశాల మేరకు పుదుచ్చేరి కలెక్టర్, ఎల్ఏడీ సెక్రటరీ వల్లవన్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న మున్సిపల్ మేనేజర్ ఖండవిల్లి రామకృష్ణకు కమిషనర్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యానాంలో రిక్రియేషన్ పేరుతో నడుస్తున్న పేకాట క్లబ్బులకు నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ లైసెన్సును రెన్యువల్ చేయడంతో పాటు కోర్టుకు సమర్పించిన నివేదికలో రెన్యువల్ చేయలేదంటూ సమాచారం ఇవ్వడంతో పలువురు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులపై సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ

దివాన్‌చెరువు, జనవరి 20: ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శనివారం ఏపీఈపీడీసీఎల్ 9వ అంతర డివిజన్ క్రీడా పోటీలను వీసీ ప్రారంభించారు. ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ టి.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఈ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం, జగ్గంపేట, రామచంద్రపురం, కాకినాడ, రంపచోడవరం, అమలాపురం, సర్కిల్ కార్యాలయం జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్, రూరల్ ఈఈ దాట్ల శ్రీధరవర్మ, ఎస్.ఎ.ఓ. కె.ఆదినారాయణమూర్తి, విద్యుత్ అధికారులు, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్యా అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి

రాజమహేంద్రవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ అనారోగ్య కారణాల వల్ల మృతి చెందాడు. రాజమహేంద్రవరంలోని భాస్కర్‌నగర్‌కు చెందిన మాటూరి వీరబాబు(26) గంజాయి కేసులో నాలుగు నెలల క్రితం అరెస్టు కాగా కోర్టు ఆదేశాలతో సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే జైలుకు వచ్చేటప్పటికే గంజాయికి బాగా అలవాటు పడడంతో అప్పటికే ఉన్న బోన్ క్యాన్సర్, టీబీ తీవ్రమయ్యాయని జైలు అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం కాళ్లు తేలిపోతున్నాయని చెప్పడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. అక్కడి వైద్యులు కాకినాడ తీసుకెళ్లమనడంతో ఏర్పాట్లు చేస్తుండగా మృతి చెందాడన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

6362 మంది హాజరు..2144 మంది గైర్హాజరు

పెద్దాపురం, జనవరి 20 : జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 8506 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 6362 మంది హాజరయ్యారని, 2144 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

రహదారి భద్రతా నియమావళిని పాటించాలి

అమలాపురం రూరల్, జనవరి 20: రహదారి భద్రతా నియమావళిని అనుసరించి వాహనాలను నడపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్అజయ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహణకు సంబంధించి గోడపత్రికను శనివారం జేసీ ఆవిష్కరించారు. ఈనెల20 నుంచి ఫిబ్రవరి 19వరకు మాసోత్సవాలు నిర్వహిస్తారన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా రవాణాధికారి అశోక్ ప్రతాప్‌రావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాస్తారోకో



రామచంద్రపురం: రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ముమ్మిడివరం, జనవరి 20: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుడే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభించే నైతికఅర్హత లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు విత్తనాల రాంబాబు, కేవీపీఎస్ నాయకుడు నిమ్మకాయల వెంకటేష్, ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు జి.బేబి, ఇందిర, భవానీ, మధ్యాహ్న భోజన పథక నాయకులు ఏవీ రమణమ్మ తదితరులు అంగన్‌వాడీలకు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్నారు. రాస్తారోకోలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వి.తలుపులమ్మ, కె.వెంకటలక్ష్మి, రత్నకుమారి, ధనలక్ష్మి, సత్యవతి, అరుణకుమారి, రమాదేవి, భవానీ పాల్గొన్నారు. వీరంతా అనంతరం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో పాల్గొని దీక్షలు కొనసాగించారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీలు శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా మూడురోడ్ల కూడలికి చేరుకుని మానవహారం ఏర్పడ్డారు. ఎన్ని ఎస్మాలు ప్రయోగించినా భయపడేది లేదన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, ఎస్.దుర్గామల్లేశ్వరి, ఎం.ఆశాలత, జి.రాధ, జి.అనంతలక్ష్మీదేవి, కె.లలిత, ఎం.వెంకటలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మామిడికుదురు: డిమాండ్ల కోసం అంగన్‌వాడీలు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని సీఎం జగన్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 40రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై దుయ్యబట్టారు. అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

రామచంద్రపురం: 40వ రోజు అంగన్వాడీల దీక్షలు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ప్రారంభించారు. 300 మంది దీక్షలో పాల్గొన్నారు. గుండెపోటుతో చనిపోయిన వర్కర్ శాంతికుమారికి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ ఇది రాష్ట్ర ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. సమ్మెలో అంగన్వాడీ నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, విజయలక్ష్మి, శ్రీదేవి, జహీరా, దుర్గ, వెంకటరత్నం, గొంతీదేవి, వీరవేణి, రెండు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొత్తపేట: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పాత బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. తొలుత ఐసీడీఎస్ కార్యాలయం నుంచి నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు కార్యకర్తలు భారీ ర్యాలీగా పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకుని ప్లకార్డులతో నినాదాలు ఇచ్చారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవోను రద్దు చేయాలని, ఎస్మాప్రయోగాన్ని ఉపసంహరించాలని, వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అమలాపురం పట్టణ సీఐగా క్రిష్టఫర్



అమలాపురం టౌన్, జనవరి 20: అమలాపురం పట్టణ సీఐగా క్రిష్టఫర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన టి.క్రాంతి కుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లికి బదిలీ చేశారు. విజయవాడలో ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న క్రిష్టఫర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఈయన అమలాపురం రూరల్ ఎస్ఐగా, రాజోలు సీఐగా పనిచేశారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ, జనసేన శ్రేణులు







మామిడికుదురు, రాజోలు, అల్లవరం మండలాల నుంచి మండపేటలో చంద్రబాబు సభకు భారీ సంఖ్యలో తరలివెళ్తున్న టీడీపీ, జనసే నాయకులు, కార్యకర్తలు

అమలాపురం టౌన్, జనవరి 20: రా.. కదిలిరా.. మండపేట బహిరంగసభకు అమలాపురం నుంచిమాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహలపై వందలాది మంది పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రమణబాబు స్వగృహం వద్ద నుంచి జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబురాజు, మల్లుల పోలయ్య, పట్నాల రమణ పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు పోతుల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో జనుపల్లి నుంచి ప్రత్యేక మోటారు సైకిల్ ర్యాలీని చేపట్టారు. వందలాది మంది అభిమానులు ర్యాలీగా మండపేట చేరుకున్నారు. మండపేటలో జరిగే బహిరంగ సభకు అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో వాహనాల ర్యాలీని ప్రారంభించారు. తొలుత కొంతదూరం పాదయాత్ర నిర్వహించారు. జనసేన నాయకులు మహాదశ నాగేశ్వర రావు, సందాడి శ్రీనుబాబు, గండి శ్రీను, సూదా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో తాటిపాకనుంచి 300బస్సులు, కార్లు, 800 మోటార్ సైకిళ్లపై టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం రాకదిలిరామండపేట బహిరంగ సభకు తరలి వెళ్లారు. మాజీ మంత్రి గొల్లపల్లి, పరిశీలకుడు పొత్తూరి రామరాజు, చిటికెల రామ్మోహనరావులు టీడీపీ, జనసేన జెండాలను ఊపి ర్యాలీని ప్రారంభించారు. రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు 12వేల మంది మండపేట తరలివెళ్లారని గొల్లపల్లి తెలిపారు.ఎంపీపీ కేతా శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధానకార్యదర్శి చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, అడబాల సాయిబాబు, ఈలి శ్రీనివాస్, సాగి పాపయ్యరాజు, వర్ధినీడి బాబ్జి, బందెల పద్మ, కడలి సునీత, చింతపల్లి నాగలక్ష్మి, కొల్లు పెద్దిరాజు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలోవెళ్లారు.

ముమ్మిడివరం: రా.. కదిలిరా.. మండపేట చంద్రబాబు భారీ సభకు కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్రేవు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు 84బస్సులు, కారులు, మోటారుసైకిళ్లపై స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ లకు చెందిన గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, గోదశి పుండరీష్, జక్కంశెట్టి పండు, సాన బోయిన మల్లికార్జునరావు, కడలి వెంకటేశ్వరరావు, మిమ్మితి చిరంజీవి తరలివెళ్లారు.

అయినవిల్లి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మండపేటలో నిర్వహించిన రా.. కదిలిరా.. సభకు శనివారం టీడీపీ, జనసేన శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామాల్లో పార్టీ పతాకాలు ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, కుడుపూడి బుజ్జి, సలాది పుల్లయ్యనాయుడు, అక్కిశెట్టి దుర్గారావు, మద్దాల సుబ్బారావు, కళ్లేపల్లి సుబ్బరాజు, కాకర శ్రీనివాస్, మట్టపర్తి రాజేశ్వరరావు, సయ్యపురాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మామిడికుదురు: మండపేటలో శనివారం జరిగిన రా.. కదిలిరా.. చంద్రబాబు సభకు మండలం నుంచి ఆరు బస్సులు, పది కార్లలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన పార్టీలకు జేజేలు కొడుతూ ర్యాలీగా వెళ్లారు. మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, టీడీపీ నాయకులు మద్దాల కృష్ణమూర్తి, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, తులా బాబ్జి, సుందరనీడి చిన్ని, కోలా రాంబాబు, జనసేననాయకుడు అడబాల తాతకాపు, విళ్ల సుబ్బారావు, కొమ్మల జంగమయ్య వెళ్లారు.

కపిలేశ్వరపురం: మండపేటలో శనివారం జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి, వల్లూరు, లంకగ్రామాల నుంచి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ ఉత్సాహంగా రా.. కదలిరా సభకు వాహనాలు, బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు.

అల్లవరం: రాబోయేది చంద్రబాబు పాలనేనని, జగన్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ అమలాపురం ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో చంద్రబాబు సభకు తరలివెళ్లారు. వేలాదిగా స్వచ్ఛందంగా చంద్రబాబు సభకుర వెళ్లడం చారిత్రాత్మకమని సత్తిబాబురాజు అన్నారు. వేగిరాజు వెంకట్రాజు, నడింపల్లి సుబ్బరాజు, ఆకుల లక్ష్మణరావు, చింతా శ్రీనివాస్, కొల్లు విష్ణుమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు, పంపిరెడ్డి కాశి, నార్లన శ్రీనివాస్, వేగిరాజు సుబ్బరాజు, కాకిలేటి సూర్యప్రకాష్, రాసూరి రాంబాబు, తోటి శ్రీదేవినరసింహారావు, లింగం శ్రీనివాస్, మంతెన సురేష్‌రాజు, గాలిదేవర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కె.గంగవరం: చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శనివారం మండపేటలో జరిగిన రా కదలిరా సభకు మండలం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పార్టీ సీని యర్ నాయుడు చుండ్రు వి.వి.ఎస్.ఎస్.చౌదరి, నూలుకుర్తి వెంకటేశ్వరరావులు జనసమీకరణ చేశారు. కె.గంగవరంలో చేరుకున్న పార్టీ నాయకులు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు.

మలికిపురం: రా.. కదిలిరా.. చంద్రబాబు మండపేట బహిరంగ సభకు శనివారం మండలం నుంచి భారీ స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. గ్రామాల నుంచి వాహనాల్లో తరలివెళ్లారు. రాజోలు నియోజకవర్గం నుంచి 30వాహనాల్లో మలికిపురం నుంచి బయలుదేరి తాటిపాకలోని మాజీ మంత్రి గొల్లపల్లి ఇంటికి చేరి అక్కడి నుంచి ర్యాలీగా మండపేట బహిరంగ సభకు తరలివెళ్లారు.

అంతర్వేది: మండపేటలో జరిగిన రా.. కదిలిరా.. చంద్రబాబు సభకు జనసేన పార్టీ రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి గుబ్బల రవికిరణ్, మండల అధ్యక్షుడు గుబ్బల ఫణి కుమార్‌లు కార్యకర్తలతో తరలివెళ్లారు. డాక్టర్ రాపాక రమేష్‌బాబు, గొల్లమందల పూర్ణభాస్కరరావు, రావూరి నాగు, ఉండపల్లి అంజి, గంటా నాయుడు, ఆకన బాబ్జినాయుడు, జనసేన నాయకులు, వీరమహిళలు తరలివెళ్లారు.

ద్రాక్షారామ: మండపేటలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన రాకదలిరా సభకు రామచంద్రపురం మండలం నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. డా.చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, క్లస్టర్‌ఇన్‌చార్జి పెంకే సాంబశివరావులు ద్రాక్షారామలో జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

ఆత్రేయపురం: చంద్రబాబునాయుడు మండపేట బహిరంగ సభకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. 17గ్రామాల నుంచి చంద్రబాబు బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వేలాదిగా బైకులు, కార్లు, ఆటోల ద్వారా తరలి వెళ్లారు. టీడీపీ జెండాలు చేతబూని జై బండారు.. జై చంద్రబాబు నినాదాలతో సభకు బయలుదేరారు.

రామచంద్రపుర: మండపేటలో శనివారం జరిగిన చంద్రబాబు సభకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నుంచి, పరిసర గ్రామాల నుంచి తెలుగుదేశం నాయ కులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.ఆర్.కె.గోపాలబాబు, కాకినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జనసైనికులు, కార్యకర్తలు, నాయ కులు చంద్రబాబునాయుడు సభకు భారీగా తరలివెళ్లారు.

కొత్తపేట: మండపేటలో జరిగిన రా కదలిరా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బహిరంగసభకు కొత్తపేట నుంచి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా తరలివెళ్లారు. ప్రతిగ్రామం నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకుల నినాదాలతో టీడీపీ జెండాల రెపరెపలు, ప్రధాన కూడలిలో బాణసంచాలకాల్పులతో తరలివెళ్లారు.

అంబాజీపేట: చంద్రబాబునాయుడు మండపేట రా కదలిరా సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన నాయకులు భారీగా తరలివెళ్లారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద నుంచి బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో వెళ్లారు. టీడీపీలో చేరేందుకు వెళ్తున్న వాసంశెట్టి సుభాష్ ర్యాలీకి టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం విజయరావు, అరిగెల బలరామమూర్తి, జనసేన నాయకులు దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: సీనియర్ టీడీపీ నాయకుడు దేవు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చెల్లూరుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కార్లు, ఆటోలు, వాహనాల్లో మండపేట తరలివెళ్లారు. గ్రామానికి చెందిన జనసైనికులు చంద్రబాబు సభకు బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం



చంద్రబాబును సన్మానిస్తున్న సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి

మండపేట, జనవరి 20: మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు మండపేటలో హెలిప్యాడ్ వద్ద శనివారం టీడీపీ, జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. ఏడిద జంక్షన్ ఆలమూరు రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పాలకొల్లు, పెద్దాపురం ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు పెందుర్తి వెంకటేష్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.జవహర్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. బహిరంగ సభలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల తో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్సీలు హాజరయ్యారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బండారు సత్యానారాయణమూర్తి, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు అయితాబత్తులు ఆనందరావు, గొల్లపల్లి సూర్యారావు, బండారు సత్యానందరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, నామన రాంబాబు, దాట్ల సుబ్బరాజు, జనసేన అమలాపురం పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జులు శెట్టిబత్తుల రాజబాబు, పితాని బాలకృష్ణ, పోలిశెట్టి చంద్రశేఖర్, వేగుళ్ల లీలాకృష్ణ, బండారు శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, దూళిపూడి బాబి, వై.వి.దాసు, వల్లూరి సాయికుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి చిత్రపటం బహూకరణ

ఆత్రేయపురం/కొత్తపేట, జనవరి 20: మండపేట బహిరంగ సభలో మాజీ సీఎం చంద్రబాబునాయుడుకి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం బహిరంగ సభ వేదికపై పార్టీ కార్యక్రమాలపై చంద్రబాబుకు బండారు వివరించారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చింతా



మలికిపురం, జనవరి 20: మోరికి చెందిన చేనేత నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా వీరభద్రేశ్వరరావు మండపేటలో మాజీ సీఎం చంద్ర బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. సుదీర్ఘ కాలం టీడీపీలో పనిచేసిన ఆయన గత ఎన్నికల అనంతరం వైసీపీలో చేరారు. వైసీపీకి రాజీనామాచేసి మళ్లీ టీడీపీలో చేరారు.

మోడరన్‌లో వార్షికోత్సవం

రామచంద్రపురం, జనవరి 20: సూర్యానగర్‌లోని శ్రీమతి గోలి మంగాదేవి మోడరన్ హైస్కూల్ ప్రాంగణమంతా శనివారం పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నాటి కలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు మాట్లాడుతూ మోడరన్ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థీనీ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు.

వ్యవసాయ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ముమ్మిడివరం, జనవరి 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ అధికారుల సంఘ అధ్యక్షుడిగా కాకి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ముమ్మిడివరం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘ అధ్యక్షుడు కె.బాలభాస్కర్, జనరల్ కార్యదర్శి డి.ప్రవీణ్, కోశాధికారి బి.మురళీకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వ్యవసాయ అధికారుల సమస్యలపై చర్చించారు. అనంతరం వారి పర్యవేక్షణలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కాకినాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎస్.రాకేష్, కోశాధికారిగా కె.సునీత, ఉపాధ్యక్షుడిగా కె.ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్వీవీ సత్యనారాయణలు ఎన్నికయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలి

మామిడికుదురు, జనవరి 20: ఆదుర్రులో అవసరమైన సాగునీరులేక ఇబ్బందులు పడతున్నామని రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈదరాడ ప్రధాన పంటకాల్వ నుంచి ఆదుర్రుకు సాగునీరు సరిగా రాకపోవడంతో 300ఎకరాలకు నీరు అందడం లేదన్నారు. వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్యకు అందించారు.

భారీ కాన్వాయ్‌తో చలో మండపేట



బండారులంకలో వాసంశెట్టి సుభాష్‌కు అపూర్వ స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

అమలాపురం రూరల్, జనవరి 20: యువ నాయ కుడు వాసంశెట్టి సుభాష్ ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. శనివారం మండపేటలో జరిగిన రా.. కదిలిరా.. బహిరంగ సభకు వందలాది వాహనాలతో అమలాపురం ఎత్తురోడ్డు వద్దనున్న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద నుంచి భారీ కాన్వాయ్‌గా మిత్రుడు గంధం పల్లరాజుతో కలిసి బయలుదేరారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భారీ కాన్వాయ్ బండారులంక చేరుకోగానే స్థానిక నాయకులు పిచ్చిక శ్యామ్, చింతా శంకరమూర్తిల ఆధ్వ ర్యంలో ఘనస్వాగతం పలికారు. పంచాయతీ కార్యా లయం వద్ద అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్, ఎన్టీఆర్, బాలయోగి విగ్రహాలకు సుభాష్ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చింతపట్ల గంగాసత్యనారాయణ, మాడా మాధవి, బండి సుబ్బారావు, పుత్సల వరదరాజులు, గోళ్ల మల్లేశ్వరరావు, కాశిన బాబి, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, అంబేడ్కర్, యును మర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు. మండపేటలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో యువ నాయకుడు సుభాష్‌తో పాటు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, ఈదరపల్లి వైసీపీ ఎంపీటీసీ అడపా సత్తిబాబు, దొంగ శ్రీను తదితరులు టీడీపీలో చేరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆత్రేయపురం, జనవరి 20: ఇరు వర్గాల కొట్లాటపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల19న రాత్రి ర్యాలి రామాలయం వద్ద రెండు వర్గాలకు చెందిన పి.దుర్గారావు, ఎం.వీరేంద్రలు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణకు పాల్పడ్డారు. ఇరు వర్గాలు తీవ్రంగా గాయపడడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామా	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్ర్కీన్-1	:గుంటూరు కారం
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: సలార్

యానాంలో త్వరలో రీజెన్సీ పరిశ్రమ ప్రారంభం

యానాం, జనవరి 20: పుదుచ్చేరి ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ గ్రీన్ పుదుచ్చేరికి యానాం రీజెన్సీ పరిశ్రమ నుంచి పూర్తి సహకారం అందిస్తామని పరిశ్రమ ఎండీ డాక్టర్ సత్యేంద్ర ప్రసాద్ తెలిపారు. యానాం పరిశ్రమ ప్రాంగణంలో యానాం పరిశ్రమ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోహన్‌రావు అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎండీ సత్యేంద్ర ప్రసాద్, అర్‌పి మునిస్వామి, ఇన్‌చార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలు హాజరైయ్యారు. యానాంలో మళ్లీ రీజెన్సీ పరిశ్రమ ప్రారంభించేందుకు అన్నిచర్యలు చేపట్టినట్టు ఎండీ సత్యేంద్ర ప్రసాద్ తెలిపారు. త్వరలోనే యానాం నుంచి ఉత్పత్తి రానుందన్నారు. వీటిలో పాటు పరిశ్రమలో సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ ఉపయోగించకుండానే ఉత్పత్తి తీస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొల్లపల్లి మాట్లాడుతూ రీజెన్సీ పరిశ్రమ ప్రారంభించేందుకు ఎలా ముందుకు వచ్చిందో, అలాగే యానాంలో పలు పరిశ్రమలు ప్రారంభించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు, స్థానికులకు మొక్కలు అందజేసారు.

అక్షింతల పంపిణీ శోభాయాత్ర

అయినవిల్లి, జనవరి 20: వీరవల్లిపాలెంలో శనివారం బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికీ అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న రామమందిరం ప్రారంభం రోజున ఈ అక్షింతలను హిందువులు తమ పూజామందిరంలో ఉంచి పూజలు నిర్వహించి సాయంత్రం దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో సలాది బాబూరావు, సలాది బుచ్చి రాజు, మిండగుదిటి చిన్నా, అడపా మోహనరావు, ముద్రగడ రామకృష్ణ, అడపా కల్యాణ్, అడపా రాంబాబు, వీరేశ్వరరావు, అడపా కోదండరామ్, విశ్వహిందూ పరిషత్‌నాయకులు గోవింద, తాడినాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: నర్సిపూడిలో అయోధ్య అక్షింతలను పల్లకీలో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికి రాముని చిత్రపటం, జెండా అక్షింతలు అందించారు. మహిళలు, గ్రామస్తుల రామ నామ సంకీర్తలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అన్ని వర్గాల వారు పాల్గొన్నారు.

రాయవరం: పసలపూడిలో శనివారం అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేశారు. వేదపండితులు నడుమ బాజా భజంత్రీలు, సన్నాయిమేళాలతో 9రామాలయాలకు వెళ్లి భక్తులకు అక్షింతలను పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త చింతా కృష్ణారెడ్డి, చింతా సుబ్బారెడ్డి, పడాల అబ్బాయిరెడ్డి, మల్లిడి రామారెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, చిన్నం సత్తిబాబు, పసలపూడి సత్యసాయి సంఘం, రామాలయాల పెద్దలు పాల్గొన్నారు.

ప్రతిమా కంపెనీపై చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, జనవరి 20: గంటిపెదపూడిలో లంక గ్రామాల ప్రజలు రాకపో కలు కోసం నదీపాయపై చేపట్టిన వంతెన కోసం మట్టి పనులు అడ్డుకుం టున్న ప్రతిమా కంపెనీపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు డిమాండ్ చేశారు. శనివారం గ్రామ స్తులతో ఆయన ఏటిగట్టు దిగువున లంకలో వంతెన పనులు వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం ర్యాలీగా వచ్చి ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మట్టి పనులు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసు కోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో కత్తుల విక్టర్‌బాబు, సాధనాల రమేష్, సరెళ్ల సంపత్, నక్కా శ్రీనివాసరావు, పల్లి పండు, దంగేటి ధర్మతేజ, విత్తనాల శేఖర్, అడ్డాల నరసింహ, చీకురమిల్లి భీముడు, సహదేవుడు, బొరుసు వీరబాబు పాల్గొన్నారు.

గోపాలపురం ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి

రావులపాలెం, జనవరి 20: గోపాలపురం ఫీల్డ్‌అసిస్టెంట్ డొల్లా మోహనరావు(43) అనారోగ్యంతో రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతు శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందారు. మోహనరావు మృతిదేహానికి ఏపీవో కవిత, సిబ్బంది నివాళులర్పించారు.

శ్రీరాముని చిత్రపటంతో శోభాయాత్ర

అంబాజీపేట, జనవరి 20: అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలో శ్రీరాముని చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక పెద్దవీధిలోని రామాలయం వద్ద నుంచి ప్రారంభమైన యాత్ర మండలంలోని 16గ్రామాలు ద్విచక్ర వాహనాలు, కార్లలో భారీ ర్యాలీ నిర్వహించారు.

చదరపు గజాల్లో పరిహారం చెల్లించాలి

మామిడికుదురు, జనవరి 20: జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు చదరపు గజాల్లో నష్టపరిహారం చెల్లించాలంటూ శనివారం పాశర్లపూడికి చెందిన రైతులు రైల్వే విస్తరణ పనులు అడ్డుకున్నారు. నష్టపరిహారం చెల్లించకుండా రైతుల భూముల్లో ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు విస్తరణ చేయడంపై తీవ్రంగా వ్యతిరేకించారు. సమస్యలను పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా న్యాయం జరగక పోవడంతో పనులు అడ్డగిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, బొక్కా రామకృష్ణ, గాలిదేవర సత్యనారాయణ, గంధం మాణిక్యం, చప్పిడి నాగేశ్వరరావు, బోనం బాపూజీ, నిడదవోలు వరప్రసాద్, నిమ్మన అప్పారావు పాల్గొన్నారు.

నల్లముట్టు పురుగు నివారణపై అవగాహన

ఉప్పలగుప్తం, జనవరి 20: కొబ్బరి చెట్లను ఆశించే నల్లముట్టు పురుగు నివారణకు సామూహికంగా రైతులు జీవనియంత్రణ పద్ధతులు పాటించాలని అంబాజీపేట కొబ్బరి పరిశోధనాకేంద్రం కీటక విభాగ శాస్త్రవేత్త వి.అనూష సూచించారు. శనివారం సన్నవిల్లిలో నల్లముట్టు పురుగు నియంత్రణపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. బ్రకాన్‌బ్రెవీకార్నిస్, గొనియోజస్ నెఫాంటిడిస్ బదనికలను చెట్టుకు 30వంతున వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిక్కం పెదబాబు, ఉద్యానవనశాఖాధికారిణి చందన, ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, చిక్కం నాగబాబు, నిమ్మకాయల రామం తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు బీమా చేయించి ధీమాగా ఉండండి

కాట్రేనికోన, జనవరి 20: పాడి పశువులకు జీవితబీమా విధిగా చేయించుకోవడం ద్వారా రైతులు ధీమాగా ఉండవచ్చని పశుసంవర్థకశాఖ డీడీ కర్నీడి మూర్తి సూచించారు. కుండలేశ్వరం ఆర్బీకేలో శనివారం పశువైద్యాధికారి యామిని అధ్యక్షతన పశువిజ్ఞానబడి నిర్వహించారు. ఇరవై శాతం ప్రీమియం రైతులు చెల్లిస్తే మిగిలింది ప్రభుత్వం చెల్లిస్తుందని, తెల్లరేషన్ కార్డుదారులందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈనెలాఖరు వరకు పశువులకు గాలికుంటు నిరోధక టీకా మందు ఇస్తున్నట్టు తెలిపారు. రాయితీపై రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు.


పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

పి.గన్నవరం, జనవరి 20: పశువులకు గాలికుంటువ్యాధి సోకకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక సహాయసంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి సూచించారు. పి.గన్నవరంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువైద్యాధికారులు పి.కిరణ్‌చైతన్య, వి.వి.వంశీలు పశువులకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నల్లచెరువు శ్రీవేంకటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి, జనవరి 20: నల్లచెరువులో గల శ్రీఅలివేలు మంగా పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రామకోటి పుస్తకాలతో భద్రాచలం



అంతర్వేది, జనవరి 20: మోరి గ్రామానికి చెందిన ఏలూరి శివ స్థానిక గ్రామస్తులు, భక్తులు రాసిన రామకోటిని భద్రాచలం తీసుకువెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై శనివారం బయలుదేరారు. కాషాయ వర్ణంలో ఉన్న జైశ్రీరామ్, జాతీయ పతాక జెండాలతో వాహనాన్ని అలంకరించారు. వాహనానికి మైక్ ఏర్పాటుచేసి జైశ్రీరామ్ పాటలు వినిపిస్తూ భద్రాచలం వైపు సాగారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సమయానికి రామకోటిని భద్రాచలంలో సమర్పించి మొక్కు చెల్లిస్తానని శివ తెలిపారు.

సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు, జనవరి 20: మండల సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. ఎంపీపీ కుసుమ వనజాకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు హాజరుకాకపోవడంపై పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఏఈ మూడు సమావేశాలకు రాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిస్తున్నట్టు జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు తెలిపారు. పలు గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ అధికారుల్లో స్పందన లేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వాపోయారు. పాశర్లపూడి సత్రం తోటలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారం కాలేదని ఎంపీటీసీ మల్లాడి వీరాంజ నేయులు వాపోయారు. గోగన్నమఠం, కొమరాడ, మాకనపాలెంలో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేసి లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని సమావేశంలో కోరారు. ఎంపీడీవో కుసుమ వెంకటేశ్వరరావు, ఏవో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీతహసీల్దార్ కె.శరణ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ద్రాక్షారామ, జనవరి 20: చట్టాలపై అవగాహన ప్రతీ ఒక్కరికి అవసరమని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల న్యాయసేవాధికారి సంఘం ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. మారుతున్నపరిస్థితులకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు వస్తున్నాయన్నారు. జూనియర్ సివిల్‌జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ ప్రజలు చట్ట, నియమ నిబంధనలు పాటించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు డి.పి.శాస్త్రి, కముజు సూర్యనారాయణ, చలపతి, బండి శ్రీను, కోర్టు సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలాజీ శనివారం ఆదాయం రూ.2,93,704

మామిడికుదురు, జనవరి 20: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,93,704 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ జి.మాధవి తెలిపారు. శనివారం స్వామివారిని 5,861మంది భక్తులు దర్శించుకుని, 3,950మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

జనసేనలోకి మాజీ సర్పంచ్ దంపతులు

కొత్తపేట, జనవరి 20: దళితసామాజిక వర్గానికి చెందిన కొత్తపేట మాజీ సర్పంచ్ పల్లికొండ శ్రీసుధాజానికిదేవి, సుధీర్‌కుమార్ దంపతులు శనివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ వారికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చేకూరి కృష్ణంరాజు, కంఠంశెట్టి చంటి, తులా రాజు, మహదశ బాబులు, జిల్లా కార్యదర్శులు, నాయకులు, అధికసంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

రావులపాలెం, జనవరి 20: ఒక ప్రక్క పండుగ సెలవులు ముగియడం మరో ప్రక్క వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా మారింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో పల్లెలు నుంచి పట్టణాలకు ప్రజలు తిరుగుప్రయాణం అయ్యారు. దీంతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రావులపాలెం జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య భారీగా పెరగడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. శనివారం మండపేటలో జరిగే చంద్రబాబు సభకు పెద్దఎత్తున వాహనాలు తరలిరావడంతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక కళావెంకట్రావు సెంటర్ నుంచి జొన్నాడ సెంటర్ వరకు వాహనాలు బారులు తీరాయి.